సాక్షి సూర్యాపేట

శనివారం । 5 । ఏప్రిల్ । 2025



చోరీలు చేస్తున్న ముఠా అరెస్ట్
దొంగల ముఠాను నకిరేకల్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారినుంచి 24 బైక్‌లు, సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. - 8లో



సాంకేతిక పద్ధతులు పాటించాలి
పంటల సాగులో రైతులు సాంకేతిక పద్ధతులు పాటించాలని ఐసీఏఆర్ హైదరాబాద్ డైరెక్టర్ షేక్ మీరా అన్నారు. - 8లో



213 క్వింటాళ్ల బియ్యం పట్టివేత
లారీలో తరలిస్తున్న 213 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు మాడుగులపల్లి టోల్ గేట్ వద్ద పట్టుకున్నారు. - 8లో

న్యూస్‌రీల్

గోదావరి జలాల పెంపు

అర్వపల్లి: యాసంగి సీజన్‌కుగాను జిల్లాకు అదనంగా మరో విడత గోదావరి జలాలను బుధవారం విడుదల చేసిన విషయం తెలిసిందే. అయితే తొలిరోజు 1000 క్యూసెక్కుల నీటిని వదలగా గురువారం 1,325 క్యూసెక్కులకు పెంచారు. మూడో సారి శుక్రవారం 1,510 క్యూసెక్కులకు పెంచినట్లు బయ్యన్న వాగు డీఈఈ సత్యనారాయణ తెలిపారు. ఈ నీటిని 69,70,71 డిస్ట్రిబ్యూటర్లకు వదులుతున్నట్లు పేర్కొన్నారు. నీళ్ల చివరి భూములకు చేరడానికే పెంచినట్లు తెలిపారు. రైతులు కాలువలకు గండ్లు పెట్టకుండా, నష్టం కలిగించకుండా గోదావరి జలాలను వాడుకోవాలని సూచించారు.

తోటివారితో ప్రేమ పూర్వకంగా ఉండాలి



మఠంపల్లి శుభవార్త చర్చిలో దివ్య సందేశమిస్తున్న నల్లగొండ బిషప్ ధమన్‌కుమార్

మఠంపల్లి: క్రైస్తవులంతా తోటి వారితో ప్రేమ పూర్వకంగా జీవించాలని నల్లగొండ మేత్రాసన పీఠాధిపతి (బిషప్) కరణం ధమన్‌కుమార్ అన్నారు. శుక్రవారం మఠంపల్లిలోని శుభవార్త చర్చిలో జూబ్లీ ఉత్సవాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై దివ్యబలిపూజ నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ.. 2025 సంవత్సరాన్ని జూబ్లీగా పోపు ప్రకటించారని తెలిపారు. గతనెల 5నుంచి ఈనెల 18న జరగనున్న గుడ్‌ఫ్రైడే వరకు ఉపవాస దీక్షల్లో ఉన్న క్రైస్తవులకు అత్యంత విలువైన కాలమని పేర్కొన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విచారణ గురువులు, చర్చి కమిటీ పెద్దలు ఆయనకు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో రెవరెండ్ ఫాదర్లు మార్టిన్, బాల, సాగర్, చిన్నప రెడ్డి, క్రీస్తురాజు పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్‌కు రెండు రోజులు సెలవు

తిరుమలగిరి: తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్ యార్డ్‌కు శనివారం మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రావ్ జయంతి, ఆదివారం వారాంతం సందర్భంగా రెండు రోజులు మార్కెట్‌కు సెలవు ఉంటుందని వ్యవసాయ మార్కెట్ ఇన్‌చార్జ్ కార్యదర్శి సురేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు తమ ధాన్యాన్ని తీసుకురావొద్దని కోరారు. తిరిగి వ్యవసాయ మార్కెట్ సోమవారం యథావిధిగా కొనసాగుతుందని పేర్కొన్నారు.

సీఎంఆర్ ఇచ్చిన మిల్లర్లకే ధాన్యం కేటాయింపు




మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాంబాబు

భానుపురి (సూర్యాపేట): సీఎంఆర్ బకాయి పూర్తి చేసిన మిల్లర్లకే 2024- 25 రబీ సీజన్ ధాన్యం కేటాయించనున్నట్లు అదనపు కలెక్టర్ రాంబాబు తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సివిల్ సప్లయ్ అధికారులు, మిల్లర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2022-23 రబీ సీజన్, 2024-25 ఖరీఫ్ సీజన్ సీఎంఆర్ బకాయిలను త్వరగా పూర్తి చేయాలన్నారు. బ్యాంకు గ్యారంటీ ఉన్న మిల్లర్లకు మాత్రమే 2024-25 ఖరీఫ్ సీజన్ ధాన్యం కేటాయిస్తామని, వేలం వేసిన ధాన్యం బకాయిలు కూడా త్వరగా చెల్లించాలన్నారు. మిల్లులకు వచ్చిన ధాన్యం పెండింగ్ ఉంచకుండా వెంటనే దిగుమతి చేసుకోవాలని సూచించారు. సమావేశంలో జిల్లా సివిల్ సప్లయ్ అధికారి రాజేశ్వర్, డీఎం ప్రసాద్, ఏఎస్‌ఓ శ్రీనివాసరెడ్డి, డీటీలు, మిల్లర్లు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పత్తి రైతుపై విత్తన భారం!

పత్తి విత్తన ప్యాకెట్ల ధరలు పెంచిన కంపెనీలు

- ఇప్పటికే అధిక పెట్టుబడులతో కుదేలవుతున్న రైతాంగం
- దిగుబడులు సైతం తగ్గి ఆర్థికంగా నష్టపోతున్న వైనం
- జిల్లాలో ఏటా 80వేల ఎకరాల్లో పత్తిసాగు



పత్తి విత్తన ప్యాకెట్ల ధరలు ఇలా.. (రూపాయల్లో..)

2019	710
2020	730
2021	767
2022	810
2022	853
2023	864
2024	864
2025	901

భానుపురి: పత్తి రైతుల కష్టాలు అన్నీఇన్నీ కావు. విత్తనాలు నాటింది మొదలు పత్తి దిగుబడి చేతికొచ్చి అమ్మేదాకా ఇబ్బందులే ఎదురవుతున్నాయి. రానున్న వానాకాలం సీజన్ ప్రారంభానికి ముందే పత్తి విత్తనాల కంపెనీలు విత్తన ధరలను పెంచేశాయి. దీంతో రైతులపై ఆర్థిక భారం మరింత పెరగనుంది. ఫలితంగా ఇప్పటికే ఏటేటా తగ్గుతూ వస్తున్న పత్తి సాగువైపు ఈసారి రైతులు మొగ్గు చూపుతారా..అన్నది ప్రశ్నార్థకంగా మారింది. ధరలు ఏటా పెంచుతుండగా నకిలీ విత్తనాల బెడద రైతులను తీవ్రంగా నష్టాల పాలుచేస్తోంది.

ఏటేటా పెరుగుతున్న విత్తన ధరలు

రైతులకు ఏటేటా పత్తి సాగుకు పెట్టుబడులు పెరు[...]. సాగు ఖర్చులతోపాటు విత్తనాలు, పురుగు మందులకు రూ.వేల్లో పెట్టుబడులు పెడుతున్నారు. దీనికి తోడుగా కూలీల ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి. ఎకరానికి రూ.10 నుంచి రూ.12వేల వరకు కలుపుతీత కోసమే ఖర్చు చేయాల్సి వస్తోంది. విత్తన కంపెనీలు ఏటా ధరలు పెంచుతుండడంతో రైతులపై ఆర్థిక భారం పడుతోంది. బీటీ పత్తి విత్తనాల ధర ఆరేళ్లుగా పెరుగుతూనే ఉన్నాయి. 2019లో పత్తి ప్యాకెట్ ధర రూ.710 ఉండగా ప్రస్తుతం రూ.901కు చేరింది.

ఎకరాకు మూడు ప్యాకెట్లు అవసరం

జిల్లాలో వరి తర్వాత పత్తి సాగే అధికంగా ఉంటుంది. 8ఏళ్ల క్రితం దాదాపు 2 లక్షల ఎకరాల వరకు పత్తి సాగు ఉండేది. కొన్నేళ్లుగా కాలం కలిసి రావడం, ఎస్సారెస్పీ నీళ్లు జిల్లాకు అందుతుండడంతో రైతులు వరిసాగు వైపు మళ్లుతున్నారు. దీనికి తోడు పత్తి ధర అంతంత మాత్రంగానే ఉంటుండడంతో ఏటా సాగు విస్తీర్ణం తగ్గుతోంది. గత వానాకాలంలో జిల్లాలో 80వేల ఎకరాల వరకు పత్తి సాగు జరిగింది. ఎకరాకు మూడు ప్యాకెట్ల చొప్పున విత్తనాలను విత్తుకోవాల్సి ఉండగా జిల్లాలో 2.40 లక్షల ప్యాకెట్ల పత్తి ప్యాకెట్లు అవసరమవుతాయి. ఒక్కో ప్యాకెట్ 475 గ్రాములు ఉంటుండగా ఇందులో 450 గ్రాముల బీటీ, 25 గ్రాముల నాన్‌బీటీ విత్తనాలు ఉంటాయి. రైతులు పూర్తిగా బీటీ విత్తనాలే వాడుకుంటారు.

పెట్టుబడులు అధికమవుతున్నాయి



పత్తి విత్తనాల కొనుగోలు నుంచి చేతికొచ్చిన పంట అమ్మకం దాకా రైతుల చేతిలో ఏదీ ఉండడం లేదు. ఏటా విత్తన ధరలను కంపెనీలు పెంచుతున్నాయి. ఇతరత్రా ఖర్చులు అధికంగానే పెరుగుతుండడంతో పత్తి సాగు చేసే పరిస్థితి లేదు.

– గుద్దేటి జాన్‌రెడ్డి, రైతు, ఆత్మకూర్(ఎస్)

ధరలను తగ్గించాలి



పత్తి విత్తనాల ధరలను ఏటా పెంచుతుండంతో రైతులపై ఆర్థిక భారం పడుతోంది. పెంచిన ధరలను కంపెనీలు వెంటనే తగ్గించాలి. లేదంటే ప్రభుత్వం పత్తి విత్తనాలపై రాయితీ ఇవ్వాలి. పత్తి సాగు చేస్తే పెట్టుబడులు చేతికి వచ్చే పరిస్థితి లేదు.

– ఉప్పుల మల్లయ్య, రైతు, ఆత్మకూర్(ఎస్)

అవకతవకలు లేకుండా సన్నబియ్యం పంపిణీ

- కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

భానుపురి (సూర్యాపేట): జిల్లావ్యాప్తంగా ఎక్కడా ఎలాంటి అవకతవకలు లేకుండా లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అన్నారు. శుక్రవారం సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారితో కలిసి రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నల్లమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లతో సన్నబియ్యం పంపిణీపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యాపేట కలెక్టరేట్ నుంచి కలెక్టర్ అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరై మాట్లాడారు. జిల్లాలో ఉన్న 610 రేషన్ షాపులకు 3800 మెట్రిక్ టన్నుల సన్న బియ్యం తరలించి ప్రజలకు పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఇప్పటికే ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లతో సమావేశం నిర్వహించామని, ఎక్కడా అవకతవకలు లేకుండా సక్రమంగా నిర్ణీత సమయంలో రవాణా చేసేలా జాగ్రత్తలు తీసుకున్నామని తెలిపారు. రెవెన్యూ అదనపు కలెక్టర్, పౌరసరఫరాల అధికారులు, చౌక ధరల దుకాణ యజమానులతో ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని చెప్పారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ రాంబాబు, పౌరసరఫరాల శాఖ అధికారి రాజేశ్వరరావు, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ ప్రసాద్ తదితరులున్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్, ఇతర అధికారులు

ప్రజల్లో చైతన్యానికే పోలీస్ ప్రజా భరోసా

- ఎస్పీ నరసింహా

అర్వపల్లి: ప్రజలను చైతన్యం చేసేందుకే పోలీస్ ప్రజా భరోసా లక్ష్యమని ఎస్పీ నరసింహ అన్నారు. శుక్రవారం అర్వపల్లి పోలీస్ స్టేషన్‌ను సందర్శించి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో సామాజిక అంశాలు, చట్టాలపై ప్రతి బుధవారం సమావేశం నిర్వహిస్తూ పోలీస్ ప్రజా భరోసా ద్వారా అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. ప్రతి బుధవారం ఒక గ్రామాన్ని ఎంచుకొని పోలీస్ అధికారులు పాల్గొనేలా సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. తాను కూడా ప్రతివారం ఒక గ్రామాన్ని సందర్శిస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో సూర్యాపేట డీఎస్పీ పార్థసారధి, నాగారం సీఐ రఘువీర్‌రెడ్డి, ఎస్‌ఐ బాలకృష్ణ, ఏఎస్‌ఐలు రామకోటి, రాములు పాల్గొన్నారు.

ప్రతి గ్రామ చరిత్ర పోలీసు రికార్డుల్లో నమోదు

తుంగతుర్తి: ప్రతి గ్రామ చరిత్ర పోలీసు రికార్డుల్లో నమోదు చేయబడి ఉంటుందని ఎస్పీ నరసింహ అన్నారు. శుక్రవారం తుంగతుర్తి పోలీస్ స్టేషన్‌ను ఆయన సందర్శించారు. పౌరులు చట్టానికి లోబడి నడుచుకోవాలన్నారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని, శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలని కోరారు. అనంతరం రికార్డులను పరిశీలించి పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఆయన వెంట డీఎస్పీ పార్థసారధి, ఎస్సై క్రాంతి కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



అర్వపల్లి పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ నరసింహ

చెడు వ్యసనాలకు బానిస కావొద్దు

నేరేడుచర్ల: విద్యార్థులు, యువత చెడు వ్యసనాలకు బానిస కావొద్దని యాంటీ నార్కోటిక్స్ బ్యూరో డీఎస్పీ భిక్షపతి అన్నారు. శుక్రవారం నేరేడుచర్లలోని న్యూ అరబిందో డిగ్రీ, స్పందన జూనియర్ కళాశాలలో డ్రగ్స్‌పై అవగాహనకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. జూన్ 16న యాంటీ నార్కోటిక్ డే సందర్భంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఆధ్వర్యంలో కళాశాలలు, పాఠశాలల్లో విద్యార్థులకు మాదకద్రవ్యాలు-వాటి అనర్థాలపై అవగాహన కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కట్ట ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ప్రిన్సిపాల్ యడవల్లి వెంకటరెడ్డి, కానిస్టేబుల్ స్వామి తదితరులున్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీఎస్పీ భిక్షపతి

బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా తొండ గ్రామ వాసి



గౌతమ్‌రావు

తిరుమలగిరి : హైదరాబాద్ స్థానిక సంస్థల బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా తిరుమలగిరి మండలం తొండ గ్రామానికి చెందిన నెమురుగొమ్ముల గౌతమ్‌రావు పేరును శుక్రవారం ఖరారు చేశారు. ప్రస్తుతం గౌతమ్‌రావు హైదరాబాద్ సెంట్రల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడిగా పని చేస్తున్నారు. విజ్ఞాన భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి చైర్మన్‌గా ఉన్నారు. ఈ ఎమ్మెల్సీ స్థానానికి ఏప్రిల్ 23న పోలింగ్ జరుగనున్నది. బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా గౌతమ్‌రావును నిర్ణయించడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వైభవంగా శ్రీలక్ష్మీనరసింహ స్వామి కల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి దేవాలయంలో శ్రీరాజ్య లక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో శ్రీ స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. కల్యాణతంతులో భాగంగా విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, మధుపర్కపూజ, మాంగల్యధారణ నిర్వహించారు. అదేవిధంగా శ్రీస్వామి అమ్మవార్లను గరుడ వాహనంపై ఊరేగించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈఓ నవీన్ కుమార్, అర్చకులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో గుర్తింపు తెస్తా



మెడికల్ కళాశాల స్నాతకోత్సవంలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

- సూర్యాపేట మెడికల్ కళాశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి
- ఆడిటోరియం నిర్మాణానికి రూ.కోటి మంజూరు చేస్తున్నట్లు ప్రకటన
- ప్రభుత్వ మెడికల్ కళాశాల స్నాతకోత్సవంలో మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి

సూర్యాపేటటౌన్ : రాష్ట్రంలోని వైద్య కళాశాలలను పటిష్టవంతంగా తీర్చిదిద్దుతామని, సూర్యాపేట మెడికల్ కళాశాలకు జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకొస్తానని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం రాత్రి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల స్నాతకోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సూర్యాపేట మెడికల్ కళాశాలకు జాతీయ స్థాయిలో గుర్తింపు పొందేలా మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేస్తామని భరోసా ఇచ్చారు. కళాశాల నిర్వాహకుల అభ్యర్థన మేరకు కళాశాల ప్రాంగణంలో 1000 సీట్లతో కూడిన ఆడిటోరియం నిర్మాణానికి కోటి రూపాయలను విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. అంతేకాకుండా విద్యార్థుల సౌకర్యార్థం రెండు బస్సులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. సమాజానికి వైద్య సేవలు అందించడంలో వైద్య విద్యార్థుల పాత్ర కీలకంగా ఉందన్నారు. ఎంబీబీఎస్ పూర్తి చేసుకున్న విద్యార్థులను ఆయన అభినందించారు. ప్రజల ఆరోగ్య బాధ్యత వైద్య విద్యార్థుల భుజస్కందాలపై ఉందనే విషయాన్ని విస్మరించకూడదన్నారు. ఈ సందర్భంగా 2019-2025లో ఎంబీబీఎస్ పూర్తి చేసిన మొదటి బ్యాచ్ 150 మంది విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేశారు.

అద్భుతమైన మెడికల్ కళాశాల భవనాన్ని నిర్మించుకున్నాం

సూర్యాపేటలో అద్భుతమైన ప్రభుత్వ మెడికల్ కళాశాల భవనాన్ని నిర్మించుకున్నామని మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. ఆనాడు మెడికల్ కాలేజీ అనగానే వెంటనే ఎగ్జిబిషన్ సొసైటీతో మాట్లాడి అనుమతి తీసుకున్నామని, విద్యార్థులు ఒక్క ఇయర్ కూడా నష్టపోకూడదని 2019 లోనే ప్రారంభించుకున్నామని తెలిపారు. కరోనా సమయంలో అద్భుతమైన సేవలు అందించిన ఘనత మన మెడికల్ కళాశాలకే దక్కిందన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే మందుల సామేలు, కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్, ఎస్పీ నరసింహ, మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, ప్రిన్సిపాల్ జయలత, కేఎన్ఆర్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ నందకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వైద్య విద్యార్థికి సర్టిఫికెట్ అందజేస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

చాలా ఆనందంగా ఉంది



సూర్యాపేట ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేసుకున్నా. నాలుగేళ్లు కష్టపడి చదివి ఎన్నో విషయాలు తెలుసుకున్నా. సర్టిఫికెట్ అందుకోవడం చాలా సంతోషంగా ఉంది. పీజీ పూర్తి చేసి రోగులకు నాణ్యమైన వైద్యాన్ని అందించేందుకు పాటుపడతా.

– అనిల్‌కుమార్ యాదవ్, కూకట్‌పల్లి

అదృష్టంగా భావిస్తున్నా



సూర్యాపేట మెడికల్ కళాశాల ప్రారంభం మొదటి బ్యాచ్ 2019లో చేరాను. ఎంబీబీఎస్ పూర్తి చేసుకోవడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నా. పీజీ చేసి మంచి సర్జన్ అవుతా. పేద వారికి నాణ్యమైన వైద్యం అందించి మన్ననలు పొందుతా.

– రామటెంకి విజయ్, మంచిర్యాల

చాలా గర్వంగా ఉంది



ఎంబీబీఎస్ పూర్తి చేసుకోవడం చాలా గర్వంగా ఉంది. కళాశాలలో అన్ని వసతులు ఉన్నాయి. ప్రొఫెసర్లు మంచి నాణ్యమైన విద్యనందించారు. మెరుగైన వైద్య సేవలందించి మంచి పేరు తెచ్చుకుంటా.

– ప్రతిమ, ఒంగోలు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం

వైద్య వృత్తి ఎంతో పవిత్రమైంది

స్నాతకోత్సవంలో ఎమ్మెల్యే మందుల సామేల్ మాట్లాడుతూ.. వైద్య వృత్తి చాలా పవిత్రమైందని అన్నారు. ఉస్మానియా మెడికల్ కళాశాల, గాంధీ మెడికల్ కళాశాలలో ఎంతోమంది పట్టభద్రులు బయటకి వెళ్లారని, ఇప్పుడు సూర్యాపేట మెడికల్ కాలేజీలో సుమారు 150 మంది విద్యార్థులు ఎంబీబీఎస్ పూర్తిచేసుకుని వెళ్లడం గొప్ప విషయమన్నారు. ఈ విజయం అందించిన అధ్యాపకులకు ధన్యవాదాలు తెలిపారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సామేల్

అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని నిరసన

హుజూర్‌నగర్‌రూరల్ : అధికారులు బిల్లు మంజూరు చేయకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని శుక్రవారం హుజూర్‌నగర్ మండల పరిధిలోని శ్రీనివాసపురం గ్రామానికి చెందిన కాంతారావు మండల పరిషత్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపాడు. ఆయన మాట్లాడుతూ.. 2022లో ఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద రూ.70 వేలతో పశువుల కొట్టం నిర్మించుకున్నానని, కానీ ఏపీఓ శైలజ సర్వర్ బిజీ అని చెప్పి మూడేళ్లుగా తనను మండల పరిషత్ కార్యాలయం చుట్టూ తిప్పుతోందని వాపోయాడు. ఈవిషయంపై జిల్లా అధికారులకు కూడా ఫిర్యాదు చేశానని తెలిపాడు. ఇప్పుడు పాత బిల్లు మంజూరు చేయడం కుదరదని ఏపీఓ అంటున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. తాను అప్పు తెచ్చి పశువుల కొట్టం నిర్మించానని, ఇప్పుడు బిల్లు రాకపోతే నాకు చావే శరణ్యమని పేర్కొన్నాడు. బిల్లు మంజూరు చేయకుండా ఇబ్బందులు పెడుతున్న ఏపీఓపై చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని కోరుతున్నాడు. ఈమేరకు ఎంపీడీఓ లావణ్య స్పందిస్తూ.. ఎన్ఆర్ఈజీఎస్ పథకంలో నిర్మించిన పశువుల కొట్టాల నిర్మాణాల ప్రతి లెవల్ ఫొటో కంప్యూటర్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఈ పథకం 2022లో సర్వర్ బిజీ వల్ల చేయలేకపోయామని పేర్కొన్నారు. ఇప్పుడు సాఫ్ట్‌వేర్ రాగాస్ నుంచి ఎన్ఐసీ కి మారిందని, అందుకే బిల్లు కాలేదని, ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు.



ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న రైతు

‘పాలిటెక్నిక్’ పిలుస్తోంది

- ప్రవేశ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం
- ఆఖరు తేది ఏప్రిల్ 21
- మే 13న పాలిసెట్
- ఎస్సీ, ఎస్టీలకు రూ.250, ఇతరులు రూ.500 ఫీజు
- జిల్లాలో రెండు కళాశాలలు



తిరుమలగిరి (తుంగతుర్తి): పదవ తరగతి తరువాత సాంకేతిక విభాగాల్లో డిప్లొమా కోర్సులు చేసేందుకు విద్యార్థులకు పాలిటెక్నిక్ కళాశాలలు దన్నుగా నిలుస్తున్నాయి. వీటిలో చేరేందుకు ఆసక్తి చూపుతున్న వారి సంఖ్య ఏటా పెరుగుతోంది. ప్రస్తుతం 2025-26 విద్యా సంవత్సరానికి గాను పాలిటెక్నిక్ కోర్సుల్లో అడ్మిషన్లకు ప్రవేశ పరీక్ష (పాలిసెట్) దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. పదవ తరగతి వార్షిక పరీక్షలు రాస్తున్న విద్యార్థులంతా దరఖాస్తులు చేసుకోవచ్చు.

రెండు కళాశాలల్లో 300 సీట్లు

జిల్లా వ్యాప్తంగా సుమారు 12 వేల మంది విద్యార్థులు పదవ తరగతి వార్షిక పరీక్షలు రాస్తున్నారు. వీరంతా పాలిసెట్ రాసేందుకు అర్హత ఉంటుంది. తుంగతుర్తి నియోజకవర్గంలోని తిరుమలగిరి, సూర్యాపేట నియోజకవర్గంలోని సూర్యాపేటలో ఒక్కొక్కటి చొప్పున రెండు ప్రభుత్వ కళాశాలలు ఉన్నాయి. తిరుమలగిరి పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమా మెకానికల్ ఇంజనీరింగ్‌లో 60 సీట్లు, డిప్లొమా సివిల్ ఇంజనీరింగ్‌లో 60 సీట్లు, సూర్యాపేట కళాశాలలో డిప్లొమా సివిల్ ఇంజనీరింగ్‌లో 60, డిప్లొమా కంప్యూటర్‌లో 60 సీట్లు, ఈసీఈలో 60 చొప్పున రెండు కళాశాలల్లో మొత్తం 300 సీట్లు ఉన్నాయి. పాలిసెట్‌లో వచ్చిన ర్యాంకు ఆధారంగా విద్యార్థులకు సీట్లు కేటాయిస్తారు. పాలిసెట్‌లో సాధించిన మార్కులు, పదవ తరగతిలో వచ్చిన జీపీఏ మార్కుల ఆధారంగా ఎంపిక ఉంటుంది. పాలిటెక్నిక్ కళాశాలల్లో హాస్టల్ వసతి కూడా ఉంది.

కోర్సు తరువాత ఉద్యోగ అవకాశాలు

పాలిటెక్నిక్‌లో మెకానికల్, సివిల్, ఎలక్ట్రికల్ అండ్ కమ్యూనికేషన్స్ కోర్సులు పూర్తి చేసే వారికి వివిధ పరిశ్రమల్లో ఉద్యోగ అవకాశాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నాయి. సాఫ్ట్‌వేర్, ఇంజనీరింగ్, ఇరిగేషన్, పబ్లిక్ హెల్త్, ఏయిర్ లైన్స్, ట్రాన్స్‌పోర్టు గనులు, ఇండియన్ ఆర్మీ, నావి, ఆర్టీసీ, ట్రాన్స్‌కో, జెన్‌కో, బీహెచ్ఈఎల్, బీడీఎల్, బీఎస్ఎన్ఎల్ మొదలైన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ, ప్రైవేట్ కంపెనీలు, కార్పొరేట్ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు పొందవచ్చు.

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి

పదవ తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థులు పాలిసెట్ ద్వారా పాలిటెక్నిక్ కళాశాలల్లో సీట్లు సాధించవచ్చు. ఈ కళాశాలలో నాణ్యమైన టెక్నికల్ విద్య అందుతుంది. భవిష్యత్తులో మంచి ఉపాధి అవకాశాలు పొందవచ్చు. పాలిసెట్‌కు అప్లయ్ చేయడానికి ఏప్రిల్ 21వ తేదీ వరకు చివరి గడువు ఉంది.

– సత్తయ్య, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, తిరుమలగిరి

పేట మార్కెట్‌కు 33,457 బస్తాల ధాన్యం రాక

భానుపురి (సూర్యాపేట): సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ యార్డుకు శుక్రవారం 33,457 బస్తాల వరి ధాన్యం వచ్చింది. అత్యధికంగా జైశ్రీరాం రకం 19,704 బస్తాలు, హెచ్ఎంటీలు 7,038 బస్తాలు, ఆర్ఐ(64) 6,632 బస్తాల చొప్పున వచ్చింది. అదేవిధంగా 333 బస్తాల పెసర, 84 బస్తాల కంది, అపరాలు మొత్తం 657 బస్తాలు వచ్చాయి. సూర్యాపేట నియోజకవర్గంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో వరి కోతలు ముమ్మరం కావడంతో పేట మార్కెట్‌కు ధాన్యం రాక పెరిగింది.



సూర్యాపేట మార్కెట్‌కు వచ్చిన వరి ధాన్యం

క్లుప్తంగా

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

త్రిపురారం: త్రిపురారం మండలం కంపాసాగర్ గ్రామ పంచాయతీ పరిధి సమీపంలో సాగర్ ఎడమ కాలువలో గురువారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. శుక్రవారం ఎస్ఐ వై. ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం రాత్రి 9గంటల సమయంలో కంపాసాగర్ గ్రామ పంచాయతీ సమీపంలోని సాగర్ ఎడమ కాలువలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం ఉండటాన్ని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీయించారు. మృతుడి ఒంటిపై నలుపు రంగు డ్రాయర్ మాత్రమే ఉందని ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 8712670196, 8712670195, 8712670125 నంబర్లకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ సూచించారు.

కారు ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు


గాయపడిన మల్లయ్య

చిట్యాల: విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై చిట్యాల పట్టణంలోని పోలీస్ స్టేషన్ ఎదురుగా జంక్షన్ వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చిట్యాల పట్టణానికి చెందిన జడల మల్లయ్య టీవీఎస్ ఎక్సెల్‌పై పోలీస్ స్టేషన్ వైపు నుంచి విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిని క్రాస్ చేస్తుండగా హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మల్లయ్య తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు మల్లయ్యను చికిత్స నిమిత్తం నార్కట్‌పల్లిలోని కామినేని ఆస్పత్రికి తరలించారు.

కోతుల దాడిలో వృద్ధుడికి..


మోతె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కోటయ్యకు చికిత్స చేస్తున్న డాక్టర్

మోతె: కోతుల దాడిలో వృద్ధుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మోతె మండలం అన్నారిగూడెం గ్రామంలో శుక్రవారం సాయంత్రం జరిగింది. బాధితుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. అన్నారిగూడెం గ్రామానికి చెందిన పోటు కోటయ్య తన ఇంటి ఆవరణలో మామిడి చెట్టు కింద మామిడి కాయలు ఏరుతుండగా కోతులు అతడిపై దాడి చేశాయి. ఈ దాడిలో కోటయ్య కుడి చెవి, మెడపై తీవ్రంగా గాయాలయ్యాయి. అతడికి మోతె మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స చేయించి.. 108 వాహనంలో సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.


సూర్యాపేట జిల్లా ప్రభుత్వ వైద్య కళాశాల స్నాతకోత్సవంను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి


విద్యార్థినికి సర్టిఫికెట్ అందజేస్తున్న మంత్రి ఉత్తమ్, చిత్రంలో మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే సామేలు, కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్, ఎస్పీ నరసింహ


స్నాతకోత్సవం(కాన్వొకేషన్)లో పాల్గొన్న వైద్య విద్యార్థులు

బైక్‌లు చోరీ చేస్తున్న ముఠా అరెస్ట్

- 24 బైక్‌లు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్, పక్కన డీఎస్పీ శివరాంరెడ్డి తదితరులు


నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలు

నకిరేకల్: బైక్‌లు చోరీ చేస్తున్న ముగ్గురు ముఠా సభ్యులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి 24 బైక్‌లు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను శుక్రవారం నకిరేకల్ పోలీస్ స్టేషన్‌లో నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ విలేకరులకు వెల్లడించారు. ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. నకిరేకల్ సీఐ రాజశేఖర్ ఆధ్వర్యంలో ఎస్ఐ లచ్చిరెడ్డి, పోలీస్ సిబ్బంది గురువారం సాయంత్రం నకిరేకల్ పట్టణంలోని ఇందిరా గాంధీ విగ్రహం వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. అదే సమయంలో నకిరేకల్‌లోని తాటికల్ రోడ్డు ఎస్సీ కాలనీకి చెందిన పాలడగు అశోక్, నార్కట్‌పల్లి మండలం అక్కెనపల్లికి చెందిన ఏర్పుల పరశురాములు, నార్కట్‌పల్లి మండలం తిరుమలగిరికి చెందిన బోడ సాయిరాం నంబర్ ప్లేట్ లేని బైక్‌పై తిప్పర్తి రోడ్డు వైపు వెళ్తుండగా.. వారిని పోలీసులు ఆపారు. బైక్‌కు సంబంధించి కాగితాలు చూపించమని అడగగా వారి వద్ద లేవని చెప్పారు. అనుమానం వచ్చి వారిని అదుపులోకి తీసుకుని విచారించగా.. బైక్‌లు చోరీ చేస్తున్నట్లు అంగీకరించారు. ఉమ్మడి జిల్లాతో పాటు హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో హోటళ్లు, బార్లు, ఇళ్ల ముందు పార్కింగ్ చేసిన బైక్‌లను దొంగిలించినట్లు ఒప్పుకున్నారు. దొంగిలించిన బైక్‌లలో 11 బైక్‌లను అమ్ముకోగా.. మరో 13 బైక్‌లను నకిరేకల్‌లో నిర్మాణంలో ఉన్న పాలడగు అశోక్ ఇంటి వెనుక దాచిపెట్టినట్లు విచారణలో వెల్లడించారు. దీంతో వారి వద్ద నుంచి మొత్తం 24 బైక్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి పర్యవేక్షణలో నకిరేకల్ సీఐ రాజశేఖర్ ఆధ్వర్యంలో నిందితులను పట్టుకున్న ఎస్ఐ లచ్చిరెడ్డి, కానిస్టేబుళ్లు వై .వెంకటేశ్వర్లు, ఎం. శ్రీను, వి. సురేష్, డి. శ్రీకాంత్‌ను ఎస్పీ అభినందించి రివార్డులు అందజేశారు.

సాగర్‌లో కిడ్నాప్ అయిన వ్యక్తి హత్య

- భూ వివాదాల కారణంగా అంతమొందించిన అల్లుడు


హరిశ్చంద్ర (ఫైల్)

నాగార్జునసాగర్: నాగార్జునసాగర్‌లోని హిల్‌కాలనీలో బుధవారం కిడ్నాప్ అయిన వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. భూమి పంచాయితీ కారణంతో సొంత అల్లుడే అంతమొందించాడు. వివరాలు.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా మాచర్ల మండలం పశువేముల గ్రామానికి చెందిన పండ్ల హరిశ్చంద్ర, బెజవాడ బ్రహ్మం సొంతం మామాఅల్లుళ్లు అవుతారు. వీరిద్దరి మధ్య కొంతకాలంగా భూమి పంచాయితీ నడుస్తోంది. గతేడాది డిసెంబర్ 16న భూమి పంచాయితీ విషయంలో వీరిద్దరు గొడవపడ్డారు. విషయం తెలుసుకున్న బ్రహ్మం అన్న (చిన్నమ్మ కొడుకు) బెజవాడ రమేష్, అక్కలు పండ్ల మంగమ్మ, పోచమండ్ల పద్మ గొడవ పడొద్దని ఇరువురిని వారించారు. దీంతో కోపోద్రిక్తుడైన హరిశ్చంద్ర గొడ్డలితో రమేష్, మంగమ్మ, బ్రహ్మం, పద్మపై గొడ్డలితో దాడిచేసి గాయపరిచాడు. తీవ్రంగా గాయపడిన రమేష్ గుంటూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కోమాలో ఉన్నాడు. ఈ ఘటనతో కక్ష పెంచుకున్న బ్రహ్మం తన మామ హరిశ్చంద్రను ఎలాగైనా మట్టుపెట్టాలని నిర్ణయించుకుని అవకాశం కోసం ఎదురుచూస్తున్నాడు. ఈ విషయం తెలుసుకున్న హరిశ్చంద్ర తన సొంతూరిలో వ్యవసాయం వదిలిపెట్టి నల్లగొండ జిల్లా కనగల్‌లో తమ బంధువుల వద్ద తల దాచుకుంటున్నాడు. ఈ నెల 2వ తేదీన స్వగ్రామంలో పింఛన్ తీసుకునేందుకు హరిశ్చంద్ర కనగల్ నుంచి బయల్దేరి నాగార్జునసాగర్‌లోని హిల్‌కాలనీకి వచ్చాడు. హరిశ్చంద్ర వద్ద సెల్‌ఫోన్ లేకపోవటంతో హిల్‌కాలనీలోని సత్యనారాయణ స్వామి ఆలయం వద్ద ఓ మహిళను ఫోన్ అడిగి పశువేముల గ్రామంలోని తన బంధువుకు ఫోన్ చేసి పింఛన్లు ఇస్తున్నారో లేదో సచివాలయంలో కనుక్కోవాలని కోరాడు. ఆ బంధువు సచివాలయంలో సమాచారం సేకరించడంతో హరిశ్చంద్ర హిల్‌కాలనీలో ఉన్నాడని బ్రహ్మంకు తెలిసింది. దీంతో బ్రహ్మం తన బంధువులతో కలిసి కారులో హిల్‌కాలనీకి వచ్చి హరిశ్చంద్రను కిడ్నాప్ చేశాడు. కొద్దిసేపటి తర్వాత హరిశ్చంద్ర బంధువు పింఛన్లు ఇస్తున్నారని సమాచారం ఇచ్చేందుకు మహిళ ఫోన్‌కు ఫోన్ చేయగా.. ఇప్పుడే కొంతమంది వ్యక్తులు వచ్చి హరిశ్చంద్రను బలవంతంగా కారులో ఎక్కించుకొని మాచర్ల వైపు తీసుకెళ్లారని సదరు మహిళ చెప్పింది. బుధవారం రాత్రి నాగార్జునసాగర్ పోలీసులు పశువేముల గ్రామానికి వెళ్లి బ్రహ్మం బంధువులను నలుగురిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వారిని పోలీసులు విచారించగా హరిశ్చంద్రను పశువేముల గ్రామంలోనే ఆయన పొలంలో హత్య చేసినట్లు గురువారం రాత్రి ఒప్పుకున్నారు. దీంతో శుక్రవారం నాగార్జునసాగర్ పోలీసులు పశువేముల గ్రామానికి వెళ్లి హరిశ్చంద్ర మృతదేహాన్ని సాగర్‌లోని కమలానెహ్రూ ఆస్పత్రి మార్చురీకి తరలించారు.

నూతన సాంకేతిక పద్ధతులు పాటించాలి

- ఐసీఏఆర్–ఏటీఏఆర్ఐ, హైదరాబాద్ డైరెక్టర్ షేక్ ఎన్. మీరా



రైతులనుద్దేశించి మాట్లాడుతున్న ఐసీఏఆర్–ఏటీఏఆర్ఐ డైరెక్టర్ షేక్ ఎన్. మీరా

గరిడేపల్లి: పంటల సాగులో రైతులు నూతన సాంకేతిక పద్ధతులు పాటించాలని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ – అగ్రికల్చరల్ టెక్నాలజీ అప్లికేషన్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (ఐసీఏఆర్–ఏటీఏఆర్ఐ), హైదరాబాద్‌డైరెక్టర్ షేక్ ఎన్. మీరా అన్నారు. శుక్రవారం గరిడేపల్లి మండలం గడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రంలో అధిక సాంద్రత పద్ధతిలో పత్తిసాగుపై ఏర్పాటు చేసిన రైతు సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు చేయడం వలన రైతులకు ఎక్కువ ఆదాయం వస్తుందని వివరించారు. రైతులు తాము పండించిన ఉత్పత్తులు స్థానిక మార్కెట్‌లో విక్రయించే బదులు ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్(ఎఫ్‌పీఓ) ద్వారా ఎగుమతి చేయాలని అన్నారు. చిరుధాన్యాలతో విలువ ఆధారిత ఉత్పత్తులు, పెరటికోళ్ల పెంపకం ద్వారా గ్రామీణ మహిళలు ఉపాధి పొందవచ్చని పేర్కొన్నారు. సూర్యాపేట జిల్లా వ్యవసాయాధికారి శ్రీధర్ మాట్లాడుతూ.. వాతావరణ మార్పుల వల్ల ఎదురయ్యే సవాళ్లను పరిష్కరించడానికి వాతావరణాన్ని తట్టుకునే పంటల వైపు రైతులు మళ్లాలని అన్నారు. అనంతరం రైతులకు డ్రమ్ సీడర్లు, బ్యాటరీ స్ప్రేయర్లు, వర్మీ బెడ్లను అందజేశారు. కార్యక్రమంలో కేవీకే ఇన్‌చార్జి ప్రోగ్రాం కోఆర్డినేటర్ డి. నరేష్, ఎస్‌ఏఐఆర్‌డీ కేవీకే సెక్రటరీ స్నేహలత, కేవీకే శాస్త్రవేత్తలు నరేష్, కిరణ్, మాధురి, ఆదర్శ్, సుగంధి, నరేష్, సైదులు, ఉపేందర్, రైతులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ హయాంలోనే చేనేత సంక్షేమం

- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్


మగ్గంపై చీర తయారీని పరిశీలిస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

భూదాన్‌పోచంపల్లి: చేనేత కార్మికుల సంక్షేమం కోసం బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అనేక పథకాలు అమలు చేశామని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక చేనేత పథకాలను రద్దు చేసిందని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ విమర్శించారు. శుక్రవారం కల్లుగీత కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్‌తో కలిసి భూదాన్‌పోచంపల్లిని ఆయన సందర్శించారు. చేనేత గృహాలకు వెళ్లి ఇక్కత్ వస్త్రాలను పరిశీలించారు. గిట్టుబాటు ధర, మార్కెటింగ్ సౌకర్యంపై కార్మికులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు చేనేత పరిశ్రమ సంక్షోభంలో కూరుకుపోయి పోచంపల్లిలో కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడుతుండగా.. కేసీఆర్ జోలెపట్టి విరాళాలు సేకరించి ఆదుకున్నారని గుర్తు చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత చేనేత పరిశ్రమ మళ్లీ ఇబ్బందులు ఎదుర్కొంటుందన్నారు. చేనేత పరిశ్రమకు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని, రూ.2లక్షల వరకు రుణమాఫీ చేయాలని, టెస్కో ద్వారా వస్త్రాలను కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తాను పర్యాటకశాఖ మంత్రిగా ఉన్న సమయంలో పోచంపల్లికి ఉత్తమ హెరిటేజ్ విలేజ్ అవార్డు రావడానికి కృషి చేశానని గుర్తు చేశారు. ఆయన వెంట మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బాత్క లింగస్వామి, బీఆర్ఎస్ పట్టణ, మండల కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తుల రిమాండ్

భువనగిరిటౌన్: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు భువనగిరి రూరల్ ఇన్‌స్పెక్టర్ వి. సంతోష్ తెలిపారు. ఇన్‌స్పెక్టర్ తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ జిల్లాకు చెందిన బుర్రి రాజ్‌కుమార్, కుందనపు సాయికుమార్‌తో పాటు మరో మైనర్ బాలుడు శుక్రవారం భువనగిరి పట్టణ శివారులోని స్వర్ణగిరి ఆలయ కమాన్ వద్ద నంబర్ ప్లేట్ లేని బైక్‌పై అనుమానాస్పదంగా తిరుగుతుండడంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకోగా 750 గ్రాముల గంజాయి లభ్యమైంది. రాజ్‌కుమార్, సాయికుమార్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. నిందితుల నుంచి మూడు సెల్‌ఫోన్లు సీజ్ చేసినట్లు పేర్కొన్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య


దేవుడు (ఫైల్)

నాగార్జునసాగర్: కుటుంబాని కి దూరంగా ఒంటరిగా ఉంటున్న వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన నందికొండ మున్సిపాలిటీ పరిధిలోని పైలాన్ కాలనీలో శుక్రవారం జరిగింది. వివరాలు.. పైలాన్ కాలనీలో నివాసముంటున్న చోడెపల్లి దేవుడు(45)కు భార్య, ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు. మద్యానికి బానిసైన అతడు గత నాలుగేళ్లగా భార్యాపిల్లలకు దూరంగా ఒంటరిగా ఉంటున్నాడు. మత్స్యకార కుటుంబానికి చెందిన దేవుడు చేపల వేటకు వెళ్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. చుట్టుపక్కల వారు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సంపత్‌గౌడ్ తెలిపారు.

ఉద్యోగ నియామక పత్రాలు అందజేత

మిర్యాలగూడ: దామరచర్ల మండలం వీర్లపాలెం గ్రామ శివారులో ఏర్పాటు చేస్తున్న యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణంలో భూములు, ఇళ్లు కోల్పోయిన 112 మందికి ఉద్యోగ నియామక పత్రాలను హైదరాబాద్‌లోని ప్రగతిభవన్‌లో డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క చేతులమీదుగా శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్ పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. భూనిర్వాసితులకు ఉద్యోగ నియామక పత్రాలు అందజేయడం ఆనందంగా ఉందన్నారు.

బోధనా పద్ధతులపై శిక్షణ

బీబీనగర్: ఎయిమ్స్ మెడికల్ కళాశాల అధ్యాపకులకు బోధనా పద్ధతులపై ఐదు రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు శుక్రవారం ముగిశాయి. శిక్షణ తరగతుల ద్వారా బోధన విధానాల్లో మార్పు వస్తుందని, విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుందని ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్ భాటియా పేర్కొన్నారు. శిక్షణ తరగతుల్లో నేర్చుకున్న అంశాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులకు బోధన చేయాలని అధ్యాపకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్ భాటియా, డీన్ రాహుల్‌నారంగ్, వైద్యులు జయప్రగసరస్సన్, రేఖా ప్రియదర్శిని, మధుసూదన్, శివరామన్ తదితరులు పాల్గొన్నారు.

మందుబాబులకు జైలు శిక్ష, జరిమానా

సూర్యాపేటటౌన్: డ్రంకెన్ డ్రైవ్ కేసులో పట్టుబడిన వారికి జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తూ శుక్రవారం సూర్యాపేట కోర్టు ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి బీవీ రమణ తీర్పు వెలువరించారు. ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం సూర్యాపేట పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో సూర్యాపేట ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించగా ఏడుగురు పట్టుబడ్డారు. వారిని కోర్టులో హాజరుపర్చగా.. ఒకరికి ఒక్క రోజు జైలుశిక్షతో పాటు మిగతా ఆరుగురికి జడ్జి జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారని ట్రాఫిక్ ఎస్ఐ తెలిపారు.

213 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత


పట్టుబడిన రేషన్ బియ్యాన్ని చూపుతున్న ఎస్ఐ కృష్ణయ్య

మాడుగులపల్లి: అక్రమంగా లారీలో తరలిస్తున్న సుమారు 213 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు మాడుగులపల్లి టోల్‌గేట్ వద్ద శుక్రవారం పట్టుకున్నారు. ఎస్ఐ కృష్ణయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని లాతూర్ జిల్లా ఖడ్గం గ్రామానికి చెందిన దివ్వెల మౌనీష్ అనే బియ్యం వ్యాపారి హుజూర్‌నగర్, పాలకీడు, నేరేడుచర్ల, దామరచర్ల, మిర్యాలగూడ పరిసర ప్రాంతాల నుంచి రేషన్ లబ్ధిదారుల నుంచి తక్కువ ధరకు రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి లారీలో మహారాష్ట్రకు తరలిస్తుండగా.. పక్కా సమాచారం మేరకు మాడుగులపల్లి టోల్‌ప్లాజా వద్ద పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. పట్టుబడిన లారీతో పాటు దివ్వెల మౌనీష్, లారీ ఓనర్ సురేంద్ర శ్యామ్‌రావు, లారీ డ్రైవర్ జిలాని ముస్తఫా షేక్, క్లీనర్ యువరాజు లక్ష్మణ్‌పై సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దార్, ఆర్ఐ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మతిస్థిమితం లేని వృద్ధురాలి చేరదీత

నల్లగొండ: మతిస్థిమితం కోల్పోయి నల్లగొండ కలెక్టర్ కార్యాలయం ఎదుట రోడ్లపై తిరుగుతున్న సుమారు 40ఏళ్ల మహిళను నల్లగొండ వన్‌టౌన్ పోలీసులు, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు చేరదీశారు. శుక్రవారం సదరు మహిళ రోడ్లపై వెళ్లే వారిపై రాళ్లు విసురుతుండడంతో స్థానికుల సమాచారం మేరకు వన్‌టౌన్ సీఐ రాజశేఖర్‌రెడ్డి ఘటనా స్థలికి చేరుకుని ఆమెను తగిన వైద్య సహాయం అందించారు. నల్లగొండ జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి కృష్ణవేణి ఆదేశానుసారం ఆ శాఖ ఫీల్డ్ రెస్పాన్స్ ఆఫీసర్ మునగాల నాగిరెడ్డి, సిబ్బంది సహాయంతో సదరు మహిళను సూర్యాపేట పట్టణంలోని అన్నపూర్ణ చారిటబుల్ ట్రస్ట్ అనాథాశ్రమానికి తరలించారు. వారికి వన్ టౌన్ పోలీస్ స్టేషన్ జమిందార్ దుర్గయ్య, మహిళా కానిస్టేబుల్, సామాజిక కార్యకర్త భీమనపల్లి శ్రీకాంత్, సునీల్ తదితరులు సహకరించారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

కోదాడరూరల్: కోదాడ పట్టణంలో గురువారం అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ మండలం దోనకల్ గ్రామానికి చెందిన కె. సైదులు(31) బోర్‌వెల్స్ బండిపై పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. రెండు రోజుల కిందట బోర్‌వెల్స్ యజమాని వీరయ్య పని నిమిత్తం సైదులును కోదాడకు తీసుకొచ్చాడు. గురువారం ఉదయం సైదులు కడుపులో నొప్పి వస్తుందని తెలుపగా యజమాని ఆర్‌ఎంపీ వద్ద చికిత్స చేయించాడు. రాత్రి పరిస్థితి విషమంగా ఉండటంతో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య నాగమణి తన భర్త మృతిపై అనుమానం ఉందని కోదాడ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెరువు మట్టితో చేనుకు పుష్టి

- రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించేందుకు ఆస్కారం

పొడిపంట

పెద్దవూర: పంట భూముల్లో సేంద్రియ పదార్థం తక్కువగా ఉండటం, వర్షపునీటిని నిలుపుకునే సామర్థ్యం తగ్గుతుండటంతో రైతులకు సరైన దిగుబడులు రావడం లేదు. మారిన వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో విపరీతంగా రసాయన ఎరువులు వినియోగించడం వల్ల భూసారం తగ్గిపోతోంది. అందుకే రైతులు చెరువు మట్టిని విరివిగా వాడుకోవాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం చెరువుల్లో నీరు అడుగంటిపోయి ఉంటుంది. ఆయా చెరువుల్లోని మట్టిని పంట భూముల్లో వేసుకుంటే రసాయన ఎరువులపై పెట్టే ఖర్చును వీలైనంతగా తగ్గించుకోవచ్చునని మండల వ్యవసాయ అధికారి సందీప్ సూచిస్తున్నారు. వర్షాలు పడినప్పుడు వరద నీటితో పోషక విలువలు కలిగిన సారవంతమైన మట్టి చెరువులోకి చేరుతుంది. వేసవిలో నీళ్లు తక్కువగా ఉండటం వలన ఈ మట్టిని పూడిక తీయడం వలన మళ్లీ వచ్చే ఏడాది చెరవులో నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుంది. ఎక్కువ నీళ్లు నిలిచే అవకాశం ఉంటుంది. తద్వారా నీటి లభ్యత పెరుగుతుంది. ఇక చెరువు నుంచి తీసిన ఈ సారవంతమైన మట్టిని పంట పొలాల్లో వేయడం ద్వారా పొలాలు సారవంతం అవుతాయి. ఈ మట్టి సేకరించి పొలానికి తరలించే ముందే భూసార పరీక్షలు చేసి తరలించడం మేలు. ఇలా కనీసం రెండు మూడేళ్లకోసారి పొలంలో మట్టిని నింపుకోవడం ద్వారా వర్షాల వల్ల నీటి కోతకు గురైన భూములకు చికిత్స జరుగుతుంది.


పొలంలో వేసిన చెరువు మట్టి

సాగుకు అనుకూలం

గ్రామాల్లో వర్షాధార చెరువులు ప్రస్తుతం అడుగంటిపోతున్నాయి. ఎండిన చెరువుల్లో 2 నుంచి 3 అడుగుల మేర పేరుకుపోయిన మట్టిని పంట భూముల్లో వేసుకోవాలి. దీనికి భూసార పరీక్షలు చేయించుకుని వాడుకుంటే మంచిది. ఎంబీ నాగలితో పాటు రోటోవేటర్‌తో కలియదున్నితే భూమిలో అప్పటికే ఉన్న మట్టితో ఇది కలిసిపోయి పంట సాగుకు అనుకూలంగా మారుతుంది.

ఒండ్రు, బంకమట్టి ఎంతో మేలు

సాధారణంగా చెరువు మట్టిలో 70 శాతం ఒండ్రు, 30 శాతం బంకమట్టి ఉంటుంది. పంటలకు అవసరమయ్యే నత్రజని, భాస్వరం, పోటాష్‌లతో పాటు సూక్ష్మ పోషకాలు కూడా ఉంటాయి. చెరువు మట్టి వలన పంట భూమిలో నీటి నిల్వ సామర్థ్యం, ఆయకట్టు విస్తీర్ణం పెరిగి అధిక దిగుబడులు సాధించవచ్చు. అంతేకాదు రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించేందుకు ఆస్కారం ఉంటుంది. విలువైన సేంద్రీయ, కర్బన పదార్థం అందివ్వడం వలన మొక్కలు నీటి ఎద్దడిని సైతం తట్టుకుని దిగుబడులు ఇస్తాయి. చెరువులోని మట్టిని ఉపయోగిస్తూ పంటలను సేంద్రియ పద్ధతుల్లో పండించుకోవచ్చు. రసాయన ఎరువులకు ఖర్చు చేయాల్సిన అవసరం లేకుండా పంటలు పండించుకునే వీలుంటుంది. వర్షాధార నేలల్లో వీటిని ఎక్కువగా వేస్తుంటారు. ఈ నేలల్లో వానాకాలం సమయంలో జొన్న, కంది, పత్తి, మినుము, మిరప, మొక్కజొన్న పంటలు సాగు చేసుకోవడానికి అనువుగా ఉంటుంది.

అధిక దిగుబడులకు అవకాశం

రైతులు రసాయన ఎరువులు వాడకం తగ్గించాలి. తమ పంట భూముల్లో సారాన్ని పెంచుకోవడానికి పెంటతో చెరువు మట్టిని వేసుకుని కలియదున్నితే ఎంతో మేలు జరుగుతుంది. పంటలకు అవసరమైయ్యే పోషకాలు మెండుగా లభించి తద్వారా పంట ఏపుగా ఎదిగి అధిక దిగుబడులు సాధించడానికి అవకాశం ఉంటుంది.

– సందీప్‌కుమార్, మండల వ్యవసాయ అధికారి, పెద్దవూర

చెరువు మట్టి పొలాల్లో వేయడం వల్ల కలిగే ప్రయోజనాలు

- చెరువు మట్టిని పొలాల్లో వేయడం ద్వారా పొలాన్ని ఆమ్ల, క్షార గుణాలతో తటస్థంగా మార్చుకోవచ్చు.
- నేల గుల్లబారుతుంది. మురుగు నీటి పారుదల మెరుగవుతుంది.
- సూక్ష్మ, స్థూల పోషకాల స్థాయి పెరుగుతుంది. ముఖ్యంగా నత్రజని స్థాయి పెరుగుతుంది.
- మట్టితో పాటు సేంద్రియ ఎరువులు కూడా కలిపి పొలంలో వేసుకోవడం ద్వారా రసాయన ఎరువుల వాడకాన్ని చాలా వరకు తగ్గించవచ్చు.
- ఈ మట్టితో సూక్ష్మజీవులు కూడా ఎక్కువగా ఉంటాయి. ఇవి నేలలో గాలి పరిమాణాన్ని పోషకాలను పెంచుతాయి.
- కరువు, వర్షాభావ పరిస్థితులను సైతం ఎదుర్కొనే శక్తిని నేలకు అందిస్తుంది.
- మొక్కలు ఆరోగ్యంగా, ఎత్తుగా పెరుగుతాయి.
- దిగుబడి కూడా ప్రతి పంటలోనూ ఎకరానికి ఏడు నుంచి పది క్వింటాళ్ల మేర పెరుగుతుంది.